క్లుప్తంగా

బైబిల్ మిషన్ సభల్లో ఉచిత వైద్య సేవలు



గుంటూరు మెడికల్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న బైబిల్ మిషన్ మహాసభల్లో లలితా సూపర్‌స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ తెలిపారు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు ప్రతిరోజూ ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు కూడా అందజేశామని పేర్కొన్నారు. తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను 550 మందికి పైగా భక్తులు వినియోగించుకున్నట్లు వెల్లడించారు. డాక్టర్ రాజేష్, డాక్టర్ రాము, నర్సింగ్ సిబ్బంది సుజాత, రాంబాబు, క్యాంప్ ఇన్‌చార్జి హెచ్ఆర్ అభిషేక్, పారా మెడికల్ సిబ్బంది భక్తులకు వైద్యసేవలు అందించారని తెలిపారు.

కొనసాగుతున్న బీజేపీ విజయ సంకల్ప యాత్ర



గుంటూరు మెడికల్: బీజేపీ విజయసంకల్ప యాత్ర పట్టణంలో కొనసాగుతోంది. ఏడో రోజులో భాగంగా సోమవారం స్థానిక రామనామక్షేత్రం భరతమాత విగ్రహం వద్ద ప్రారంభమైన యాత్ర సంపత్‌నగర్, నల్లచెరువు, ఆర్.అగ్రహారం, పట్నంబజారు, ఎత్తు రోడ్డు, అడపా బజారు, నగరంపాలెం అమరవీరుల స్తూపం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్‌నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి గడప గడపకు వెళ్లి వివరిస్తున్నామని తెలిపారు. మోదీ మరోసారి కేంద్రంలో రావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, నేతలు నేరేళ్ల మాధవరావు, ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, కారంశెట్టి రమేష్‌కుమార్, మాధవీలత, శ్రావణకుమారి, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఏబీవీపీ నూతన కమిటీ ఎంపిక



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సోద్ కో కన్వీనర్ రమాకాంత్ పాల్గొని నూతన కమిటీని ప్రకటించారు. విశ్వవిద్యాలయం అధ్యక్షురాలుగా దావులూరి హర్షిత, కార్యదర్శిగా కె.మణికంఠ, ఉపాధ్యక్షులుగా పి.హేమంత్‌రామ్, కె.వి.శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా దేదీప్య, యుగంధర్ , మహిళా ఇన్‌చార్జిగా దువ్వ త్రివేణి, సోషల్ మీడియా కన్వీనర్‌గా హరీష్, హాస్టల్ ఇన్‌చార్జిగా జి. ఓబుల్‌రెడ్డి, స్పోర్ట్స్ ఇన్‌చార్జిలుగా వాసు, కేశవ, దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యుడు పవన్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రీయ స్వయం సేవక్ అనుబంధ సంస్థ సక్ష్యమ్ సేవా సంస్థ జాతీయస్థాయిలో దివ్యాంగులకు అవసరమైన పరికరాలను అందించడం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతోందని సంస్థ జిల్లా కార్యదర్శి వి.వి. రామారావు పేర్కొన్నారు. పట్టాభిపురం కమిటీ పాఠశాలలో సోమవారం ఇద్దరు దివ్యాంగులకు ట్రై సైకిళ్లతో పాటు మరో దివ్యాంగుడికి స్వయం ఉపాధి కోసం రౌండ్ టేబుల్ మహిళా విభాగ సహకారంతో బడ్డీ కొట్టు అందజేశారు. ఈసందర్భంగా రామారావు మాట్లాడుతూ నేత్రదాన ఆవశ్యకతపై ప్రజల్ని చైతన్యవంతం చేయడంతో పాటు అనుబంధ సంస్థ సమర్థనం ట్రస్ట్ ద్వారా శిక్షణ, ఉపాధి అవకాశాల్ని కల్పించే విధంగా అన్ని రకాల సేవలకు చేయూత ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణి, కార్యదర్శి పి.వి. అరవింద, శశాంక్, కాశీనాథ్, వీరాంజనేయులు, కోటేశ్వరరావు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ పరిధిలోనే సమస్యలకు పరిష్కారం

అధికారులకు కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితర సమస్యలకు వార్డు సచివాలయం స్థాయిలోనే పరిష్కారం జరిగేలా విభాగాధిపతులు, నోడల్ అధికారులు చొరవ చూపాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో స్పందన నిర్వహించారు. తొలుత గత వారం స్పందనలో అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. విభాగాధిపతే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలకు సిఫార్స్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల స్థానిక సమస్యల్ని నగరంలోని 206 వార్డు సచివాలయాల పరిధిలోనే పరిష్కారం జరిగేలా కార్యదర్శులు కృషి చేయాలని ఆమె చెప్పారు. ప్రజలు కూడా తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ రావాల్సిన అవసరం లేదని కమిషనర్ సూచించారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంటును ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని చెప్పారు. స్పందన అర్జీల అప్‌డేట్స్ ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు.

ప్రజల నుంచి 39 ఫిర్యాదులు

సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి 39 ఫిర్యాదులు అందాయని కమిషనర్ తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 14, రెవెన్యూ విభాగానికి 2, ప్రజారోగ్య విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి 3, అకౌంట్స్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. నిర్దేశిత గడువులోగా వాటిని పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.లక్ష్మీశివజ్యోతి, డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందరరామిరెడ్డి, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, సీఎంఓహెచ్ డాక్టర్ డి.ఆషా, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఈఈలు, ఆర్ఓలు పాల్గొన్నారు.

దుష్ట చతుష్టయంతో పోరుకు సమయం ఆసన్నం

ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు: రానున్న ఎన్నికలు ధర్మానికీ, అధర్మానికీ మధ్య నడుస్తున్న పోరాటమని, దుష్టచతుష్టయంతో ఎంతటి పోరుకైనా సిద్ధంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం పార్టీ ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. అనంతరం పేదలకు పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధానికి మేము సిద్ధం పోస్టర్లు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ముస్తఫా, నూరి ఫాతిమా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేపట్టిన తరువాత అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రం విరాజిల్లుతోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తన కుమార్తె నూరిఫాతిమాను భారీ మెజార్టీతో గెలిపించి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌కు తూర్పు నియోజకవర్గ సీటును బహుమతిగా ఇవ్వాలని కోరారు. నియోజకవర్గ పరిధిలో 98 శాతం పనులు పూర్తి చేశామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలు, ఓటు హక్కును అడిగే అర్హతను కల్పించాయని తెలిపారు. సంక్షేమ పథకాల్ని పేదలకు ఇచ్చిన జగనన్న ప్రభుత్వం మరోమారు అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు సీఎం జగన్ పెద్దపీట

నెహ్రూనగర్: మహిళా సాధికారితకు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. మహిళల స్వయం ఉపాధి నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం పలు చేతివృత్తుల వారికి శిక్షణ ఇచ్చింది. ఇందులో తూర్పు నియోజకవర్గం నుంచి అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన రేణుకకు సబ్సిడీతో కూడిన కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మిషన్‌ను(పట్టణ ప్రగతి యూనిట్) అందజేసింది. సోమవారం సదరు యూనిట్‌ను ఎమ్మెల్యే ముస్తఫా, ఫాతిమా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలంతా సొంత కాళ్లపై నిలబడే విధంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. స్వ యం ఉపాధితో మరింత ఆర్థికంగా ఎదగవచ్చని సూచించారు. అనంతరం రేణుకకు పట్టణ ప్రగతి యూనిట్ సర్టిఫికెట్‌ను అందజేశారు. స్థానిక కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ, సీఎంఎం నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు యర్రబాబు, నరకట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల రూపురేఖలు మార్చిన ప్రభుత్వం

పట్నంబజారు: రాష్ట్రంలో గ్రంథాలయాల రూపురేఖలు మార్చి, అధునాతనంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 9, 10 డివిజన్‌ల పరిధిలో గాంధీ విగ్రహం వద్ద నూతనంగా నిర్మించనున్న గ్రంథాలయానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టిన తరువాత జ్ఞాన సంపదను పెంచే గ్రంథాలయాల్ని ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. కనీసం కొత్త పుస్తకాలు కూడా కొనలేని పరిస్థితి టీడీపీ ప్రభుత్వంలో ఉండేదని విమర్శించారు. ఆ దుస్థితిని మార్చి, గ్రంథాలయాలకు కొత్త శోభను తీసుకునివచ్చిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు రాచమంటి భాస్కర్, మీరావలి, తలారి రాము, కుర్రా పున్నారావు, చెన్నుబోయిన వెంకట్రావు, భట్టు ప్రసాద్, శ్రీనివాసరావు, మణికంఠ పాల్గొన్నారు.

అకౌంట్ నుంచి నగదు మాయం చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: వృద్ధురాలి కేర్ టేకర్‌గా ఉన్న వ్యక్తి ఆమె అకౌంట్‌లో నగదు డ్రా చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రామన్నపేట 1/5లో భీమినేని అనురాధ తల్లి ఒంటరిగా నివసిస్తోంది. ఆమెకు పి.సాంబశివరావు కేర్ టేకర్‌గా ఉన్నాడు. అతడు వృద్ధురాలి సెల్‌ఫోన్ పేటీఎం నుంచి పలుమార్లు తన అకౌంట్‌లోకి రూ. 9 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడు. ఆలస్యంగా గుర్తించిన అనురాధ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

పాత కక్షల నేపథ్యంలో ఇద్దరు యువకులు వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోబాల్ట్ పేట ఐదో లైనులో షేక్ మస్తాన్‌వలిపై హర్షవర్ధన్, అతని స్నేహితుడు పాత కక్షల నేపథ్యంలో సోమవారం దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేటూరికి ఘన నివాళి



లక్ష్మీపురం: అక్షర రుషి, తెలుగు సినీ కవి సార్వభౌముడు వేటూరి సుందరరామమూర్తి అని రంగస్థల నటుడు, గాయకుడు పి.ఘనశ్యామాచార్యులు కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వేటూరి సుందరరామమూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సినీ రంగ విశ్లేషకులు అమరాచారి, సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



ప్రతిజ్ఞ చేస్తున్న రవాణాశాఖ అధికారి రాఘవరావు, తదితరులు

పెదకాకాని: వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి రాఘవరావు సూచించారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా కళాశాల బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ అధికారి రాఘవరావు మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రోడ్డుకు ఎడమ వైపు మాత్రమే వాహనాలు నిలపాలని సూచించారు. యాజమాన్యాలు డ్రైవర్లకు ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. రోడ్ల పైకి వచ్చే వాహనాలకు తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రత మనందరి బాధ్యత అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలు మనందరి మంచి కోరి రవాణా శాఖ నిర్వహిస్తుందని తెలిపారు. రవాణా శాఖ అధికారులు అందించే సూచనలు డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. అనంతరం డ్రైవర్లతో రోడ్డు నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కె. మల్లీశ్వరి, జి. సౌజన్య, కళాశాల ట్రాన్స్‌పోర్ట్ కన్వీనర్ పి.వి. సురేంద్రమోహన్ కుమార్, ఎం. లక్ష్మీ వినీత, విద్యార్థులు, రవాణా సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రూప్- 2పై సదస్సు



ఏఎన్‌యూ: వికాస్ భవన్‌లో ఈనెల 31న జరుగనున్న గ్రూప్- 2 అవగాహన సదస్సు పోస్టర్‌ను సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సదస్సులో ప్రధాన వక్తగా ప్రముఖ విద్యావేత్త ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పాల్గొని, అభ్యర్థుల ప్రశ్నలను నివృత్తి చేస్తారని చెప్పా రు. ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ ప్రెసిడెంట్ సంతోష్ , సెక్రటరీ ఆదిశేషు, కమిటీ మెంబర్ నవిత పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుంటూరు రూరల్: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ రాధిక తెలిపారు. సోమవారం 40వ డివిజన్ పెదపలకలూరు గ్రామం జన్మభూమి నగర్‌లో విజ్ఞాన్ నిరుల కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, తులసీ హాస్పిటల్ సిగ్నేచర్ స్మైల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా వెంటనే వైద్యులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. లేకుంటే అవే దీర్ఘకాలిక వ్యాధులుగా మారే అవకాశాలున్నాయని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉచిత వైద్య శిబిరంలో 548 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అంకమ్మనాయుడు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, తులసీ ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు మైక్ సెట్ వితరణ



మైక్ సెట్ అందిస్తున్న డాక్టర్ రాయపాటి మమత, సిబ్బంది

గుంటూరు మెడికల్: గుంటూరు రమేష్ హాస్పిటల్ యాజమాన్యం సోమవారం వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు మైక్ సెట్‌ను వితరణగా అందజేసింది. స్టేషన్ పరిధిలోని ఎంటీబీ సెంటర్‌లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నందున ఎనౌన్స్‌మెంట్ చేసేందుకు మైక్ సెట్ కావాలని పోలీసులు సంప్రదించారు. రమేష్ హాస్పిటల్ యాజమాన్యం స్పందించి వెస్ట్ ట్రాఫిక్ పోలీసు అవసరాన్ని గుర్తించి సెట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా హాస్పటల్ యాజమాన్యం డాక్టర్ రాయపాటి మమత, సిబ్బందికి వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబుది చౌకబారు చరిత్ర

విద్యార్థులతో ముఖాముఖీలో వైఎస్సార్ సీపీ నేతలు



విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

పట్నంబజారు: ఒక్క ప్రజా ఉపయోగకరమైన పథకం కూడా తీసుకురాలేని చౌకబారు చరిత్ర చంద్రబాబుకి మాత్రమే సొంతమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుంటూరు క్లస్టర్ – 2 పార్టీ అధ్యక్షుడు నూనె ఉమామహేశ్వరరెడ్డి విమర్శించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ బీసీ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు గూడూరు నాని ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో కాలనీలో బీసీ విద్యార్థులతో సోమవారం వైఎస్సార్ సీపీ నేతల ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూనె ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఏ పథకమైనా అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చినప్పుడే అది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని చెప్పారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు జనరంజకం కనుకనే విద్యార్థుల నోళ్లలోనూ నిత్యం నానుతూ ఉన్నాయని స్పష్టం చేశారు. చంద్రబాబు స్వప్రయోజనాల కోసం తప్పితే ప్రజల మేలు కోరి కనీసం ఒక్క పథకం కూడా ప్రవేశపెట్టిన పాపాన పోలేదని ఆరోపించారు. 2024లో జరగనున్న ఎన్నికల యుద్ధం ఎప్పుడు వచ్చినా... సీఎం వైఎస్. జగన్‌మోహన్ పక్షాన పోరాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడుపుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఓ వైపు ఉంటే.. ప్రజల్ని నిత్యం మోసం చేస్తూ 14 సంవత్సరాలు పరిపాలించినా కనీసం ఒక్క పథకం కూడా ప్రవేశపెట్టానన్న చెప్పుకోలేని స్థితిలో ఉన్న చంద్రబాబు మరోవైపు ఉన్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరోమారు జగనన్న తిరిగి సీఎంను చేసుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని పేర్కొన్నారు. కార్పొరేటర్ షేక్ రోషన్, పార్టీ నేతలు మల్లికార్జున యాదవ్, అరుణ పాల్గొన్నారు.

నైపుణ్యాలతో పరిశ్రమలకు అనుసంధానం కావాలి



ప్రొఫెసర్ దేసు రామమోహనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు నైపుణ్యాల్ని పెంపొందించుకుని పరిశ్రమలకు అనుసంధానం కావాలని మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డీన్ ప్రొఫెసర్ దేసు రామమోహనరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన స్ఫూర్తి-ది ఐక్యూబ్ ఎక్స్‌పోను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థుల్ని ప్రోత్సహించడంలో ఎక్స్‌పోలు దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థులు తమ ఆవిష్కరణల్ని మార్కెట్‌కు పరిచయం చేయడంతో పాటు పరిశ్రమల ప్రతినిధులతో మమేకం కావడం ద్వారా జ్ఞాన సముపార్జన, నైపుణ్యాభివృద్ధికి ఉపయోగపడుతుందని చెప్పారు. హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుతో వచ్చే ఉద్యోగావకాశాల్ని వివరించారు. ఐటీసీ సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ రామచందర్ మాట్లాడుతూ భావి పారిశ్రామికవేత్తలుగా రాణించడంలో విద్యార్థులకు ఎక్స్‌పోలు దోహదం చేస్తాయని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామివేత్తలుగా స్టార్టప్‌లను స్థాపించి, ఉద్యోగావకాశాలను కల్పించడంతో పాటు దేశ ఆర్థికావృద్ధికి దోహదపడాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థుల్ని పరిశ్రమల అవసరాలకు దీటుగా తయారు చేసేందుకు విద్యాసంస్థలు, పరిశ్రమల అనుసంధానమే మార్గమని తెలిపారు. వివిధ పారిశ్రామిక, ఆస్పత్రుల ప్రతినిధులతో పాటు స్ఫూర్తి కన్వీనర్ డాక్టర్ వి. చక్రవర్తి, కో-కన్వీనర్ డి. కళ్యాణి, సహాయాచార్యులు సీహెచ్. వైష్ణవి, సీహెచ్ వేదవతి, వి.బాజీబాబు, వి.అభిలాష్, డాక్టర్ గోపి శ్రీనివాసరావు, ఎస్. మణికంఠ, బి. అనిత పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఇన్నర్ రోడ్లకు శంకుస్థాపన



కలెక్టరేట్‌లోని పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: పర్యావరణ హితంగా, కాలుష్యరహితంగా కలెక్టరేట్‌లో ఆవరణలో రోడ్లు నిర్మిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్ ఆవరణను జేసీ రాజకుమారి, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ క్లియర్ ఎయిర్ ప్రోగ్రాం ద్వారా అందిన రూ.30 లక్షలతో ఇన్నర్ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని గోడౌన్లలో భద్రపరచిన ఈవీఎం మెషీన్లు తరలించడంతోపాటు నిత్యం రద్దీగా ఉండే రిజిస్ట్రేషన్, ఇతర కార్యాలయ రాకపోకలకు కూడా వీలుగా ఉంటుందని చెప్పారు. అనంతరం రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.శ్రీకర్, ఇన్‌చార్జి డీఆర్వో లక్ష్మీ కుమారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితులతో జీఆర్పీ ఎస్ఐ రమేష్

లక్ష్మీపురం: అక్రమంగా మద్యం సీసాల్ని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని అరెస్టు చేసిన ఘటన సోమవారం గుంటూరు రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే జీఆర్పీ ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఆదేశాల మేరకు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు సమక్షంలో గుంటూరు రైల్వే స్టేషన్‌లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల బ్యాగ్‌లో మద్యం సీసాలు దొరికాయి. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని జీఆర్పీ స్టేషన్‌కు తరలించి విచారించారు. పాండిచ్చేరి రాష్ట్రం యానాం నుంచి గుంటూరుకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. ఇద్దరి నుంచి ఐదు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రైళ్లలో అక్రమంగా మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నట్లు ప్రయాణికులకు అనుమానం కలిగిన తక్షణమే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఈవీఎంల పనితీరుపై ప్రజలకు అవగాహన



ఈవీఎం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సిద్ధార్థ

ప్రత్తిపాడు: ఈవీఎంలపై ఓటర్లు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తహసీల్దార్ జి.సిద్ధార్థ తెలిపారు. మండల పరిధిలోని నడింపాలెం, రావిపాటివారిపాలెం గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సోమవారం ఈవీఎంల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవీఎం పనితీరు, ఓటు వేసే విధానం, వేసిన తరువాత వీవీప్యాట్‌ల్లోనికి స్లిప్ వచ్చే విధానం.. వంటి పలు అంశాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎప్పటిలానే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారానే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఈవీఎంల వినియోగంపై కొందరికి సందేహాలు, అనుమానాలు ఉన్నాయని, అలాంటి వాటిని తొలగించేందుకే ఎన్నికల కమిషన్ ఈవీఎంలపై అవగాహన కల్పిస్తుందన్నారు. నిన్నటి వరకు తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగిన అవగాహన క్యాంప్, నేటి నుంచి గ్రామాల్లో కూడా కొనసాగనుందని తహసీల్దార్ తెలిపారు.

రహదారి ప్రమాదంలో దంపతులకు గాయాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వేజండ్ల అడ్డరోడ్డు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. తెనాలి నుంచి గుంటూరుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులను, వడ్లమూడిలో జరిగిన టీడీపీ సభకు వెళ్తున్న యువకులు ద్విచక్ర వాహనంతో అతివేగంతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తెనాలికి చెందిన దంపతులు టి.రత్నకుమారి, వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. రత్నకుమారి తలకు బలమైన గాయమైంది. ఇద్దరిని 108 వాహనం ద్వారా గుంటూరు వైద్యశాలకు తరలించారు.